ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
సోమవారం 20 అక్టోబరు 2025





ఆర్టీఏ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ డీఎస్పీ

దివ్యకాంతుల దీపావళి నేడు



- జోరుగా బాణసంచా విక్రయాలు
- ఇంటింటా లక్ష్మీపూజలకు ఏర్పాట్లు
- రంగురంగుల పూలు, మామిడి తోరణాలతో అలంకరణ
- పేలుతున్న టపాసుల ధరలు
- 40 శాతం పెరిగిన రేట్లు
- ప్రజలకు ప్రముఖుల పండుగ శుభాకాంక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి/ ఇల్లెందు/కొత్తగూడెం సాంస్కృతికం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి అంటే దీపాల వరుస.. పటాకుల మోతలు.. కాకరపూల కాంతులు.. భూచక్రాల వెలుగులు.. చిచ్చుబుడ్ల జిలుగులు.. పసందైన పిండివంటలే కాదు.. అల్లరి పిల్లలు, పిల్లల్లా మారే పెద్దలు, కేరింతలు, తుల్లింతలు కలగలిసిన పండుగ దీపావళి. వెలుగు పూల వేడుక చీకట్లను పారదోలి వెలుగులను నింపే దివ్వెల పండుగ దీపావళికి ఉమ్మడి జిల్లావాసులు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఇళ్లను శుద్ధి చేసి రంగురంగుల పూలు, మామిడాకుల తోరణాలతో అలంకరించుకున్నారు. కుటుంబసభ్యులు, బంధువులతో ప్రతి ఇల్లూ శోభను సంతరించకోగా.. లక్ష్మీ పూజలు, నోములకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ ఏడాది దీపావళి టపాసుల ధరల మోత మోగుతోంది.

దివ్వెల పండుగ దీపావళి పర్వదినాన్ని అత్యంత వైభవంగా జరుపుకునేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లావాసులు సిద్ధమయ్యారు. విజయానికి ప్రతీకగా, చీకట్లను పారదోలి జీవితాల్లో వెలుగుల నింపే పండుగగా ఘనంగా జరుపుకుంటారు. కుటుంబ సభ్యులకు తోడు బంధుమిత్రులు తరలిరావడంతో ఇళ్లన్నీ సందడిగా మారాయి. పూజా సామగ్రి, ప్రమిదల అమ్మకాలతో ప్రధాన రహదారులు రద్దీగా మారాయి. కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. ఇక దీపావళి అంటే పటాకుల మోత. ప్రతి ఇంటింటా సందడే సందడి. బట్టల వ్యాపారాలు, కిరాణా వ్యాపారాలు, దీపావళి పటాకులు, పువ్వులు మొదలుకొని నోముల సామగ్రి వరకు అన్నింటికీ మంచి గిరాకీ ఉంటుంది. పర్యావరణ హిత దీపావళి ఆనందమే కాదు ఆరోగ్యం కూడా. ప్రమాదకరమైన రసాయనాలతో నిండిన పటాకులు పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తాయి. వాటి పొగ వల్ల ఊపిరితిత్తుల సమస్య విపరీతమైన శబ్దాలతో చెవులు దెబ్బతినే ప్రమాదం ఉంది. పర్యావరణానికి హాని కలిగించే పటాకులకు నో చెప్పి దీపాలంకరణలతో ఎకో ఫ్రెండ్లీ క్రాకర్స్‌ను కూడా చాలా తక్కువ వినియోగిస్తూ పండుగను జరుపుకుందాం.

లక్ష్మీ పూజలు..

దీపావళి పండుగను వ్యాపారవర్గాలు ఘనంగా నిర్వహిస్తాయి. లక్ష్మీ కటాక్షం లభించాలని ధనలక్ష్మికి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా (మిగతా 7వ పేజీలో)

ప్రజలు సిరిసంపదలతో వర్ధిల్లాలి

పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి తుమ్మల



ఖమ్మం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ప్రజలు, రైతులు సిరి సంపదలతో వర్ధిల్లాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో దీపావళితో కొత్త వెలుగులతో వికసించాలని ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటనలో ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామని పేర్కొన్నారు. ప్రజలందరితో పాటు రైతుల జీవితాల్లో ఆనందపు ప్రగతి కాంతులు వెల్లివిరియాలని కోరారు. దీపావళి పండుగ నుంచే రైతుల పంటలు చేతికి రావడం జరుగుతుందన్నారు.

ఏసీబీ సోదాల కలకలం

- ఉమ్మడి జిల్లాలో పలు చెక్‌పోస్టులపై ఏసీబీ దాడులు
- రూ. వేలల్లో నగదు స్వాధీనం
- అధికారుల అదుపులో పలువురు అనధికార సిబ్బంది

అశ్వారావుపేట/ పాల్వంచ రూరల్/ పెనుబల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు చెక్‌పోస్టులపై ఏసీబీ అధికారులు శనివారం అర్ధరాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించడం కలకలం రేపింది. అశ్వారావుపేట, పాల్వంచతో పాటు ముత్తగూడెం వద్ద గల ఆర్టీఏ చెక్‌పోస్టుల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. అదీ ఏకంగా గంటల తరబడి..! ఈ సందర్భంగా ఆయా చెక్‌పోస్టుల్లో లెక్కల్లో లేని వేలాది రూపాయల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే చెక్‌పోస్టుల్లో పలువురు అనధికార సిబ్బంది ఉన్నట్టు గుర్తించి.. వారిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఆర్‌టీఓ(రవాణా) చెక్‌పోస్టుపై శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల వరకు ఏసీబీ డీఎస్పీ వై రమేష్ ఆధ్వర్యంలో ఒక్కసారిగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 23వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే ముగ్గురు అనధికారంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 10మంది ఏసీబీ అధికారుల బృందం ఈ దాడుల్లో పాల్గొన్నారు. అలాగే ఆంధ్రా-తెలంగాణ సరిహద్దులోని ఖమ్మంజిల్లా పెనుబల్లి మండలం ముత్తగూడెం చెక్‌పోస్టుపై శనివారం అర్ధరాత్రి ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ఆదివారం ఉదయం 9.30గంటల వరకు కార్యాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల్లో నమోదు కాని రూ.6660నగదును సిబ్బంది వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రైవేట్ సిబ్బంది ద్వారా అక్రమంగా వసూళ్లు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ.. చెక్‌పోస్టు మీదుగా రాకపోకలు సాగించే వాహనాలు ఓవర్‌లోడ్, పర్మిట్‌లు, ఇతరత్రా లోపాలు వెలుగులోకి రాకుండా కొందరు సిబ్బంది అనధికారిక వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. అనుమతులు లేకుండానే అనధికార సిబ్బందిని ఈ వ్యవహారం కోసం ఉపయోగిస్తున్నారని తనిఖీల్లో వెలుగు చూసిందని డీఎస్పీ తెలిపారు. ఈ సోదాలపై పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని ఆయన తెలిపారు.

ఎలాంటి హడావుడి లేకుండా.. సాదాసీదాగా వచ్చి..

అది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని నాగారం కాలనీ వద్ద ఉన్న ఆర్టీవో చెక్‌పోస్టు. శనివారం సమయం (మిగతా 7వ పేజీలో)

వందేళ్ల ఉత్సవాన్ని.. అట్టహాసంగా జరుపుకొందాం

- మరో వందేళ్లు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుదాం
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

పాల్వంచ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కేంద్రంగా జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ శతాబ్ది ముగింపు ఉత్సవాలను అట్టహాసంగా జరుపుకొందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం పాల్వంచలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శత వసంత ఉత్సవాలకు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు తరలి రానున్నారన్నారు. ఖమ్మం వేదికగా జరిగే ముగింపు ఉత్సవ సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని, ఇందు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. సీపీఐ పోరాటాలను, ఉద్యమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. సీపీఐ చరిత్రను ప్రజలకు వివరించాలని సూచించారు. కమ్యూనిస్టుల పని అయిపోయిందని అంటున్న వారి నోళ్లు మూతపడేలా ఉత్సాహపూరిత వాతావరణంలో ఈ వేడుక ఉండబోతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు రాజ్యాలు వస్తున్నాయని, ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో ముందుకు సాగితే రాజ్యాధికారం చేపడతామని కూనంనేని సాంబశివరావు ధీమా వ్యక్తం చేసారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కులాలు, మతాల పేరుతో ప్రజలను విడదీస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటుందన్నారు. ప్రశ్నించే వారిని జైళ్లకు పంపుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తోందని మండిపడ్డారు. అనంతరం సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా జిల్లా రాజకీయ పరిస్థితులను వివరించి.. శత వసంత ఉత్సవాలను జయప్రదం చేయడం కోసం సభ్యులకు లక్ష్యాలను నిర్దేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు మిర్యాల రంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, నరాటి ప్రసాద్, ఉదయ్ భాస్కర్, సలీం, శ్రీనివాస్, రవికుమార్, శంకర్, నరేంద్ర కుమార్, మురళి, జమలయ్య, భూక్యా దస్రు, ఉప్పుశెట్టి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దరఖాస్తుల గడువు పెంపు

- 23 వరకు స్వీకరిస్తాం .. 27న లాటరీ
- భద్రాద్రి జిల్లా ఎక్సైజ్ శాఖాధికారి కె.జానయ్య



చుంచుపల్లి, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): 2025-2027 రెండు సంవత్సరాల కాలపరిమితికి నూతన మద్యం దుకాణాల దరఖాస్తులకు ప్రభుత్వం గడువు పొడిగించిందని.. అందువల్ల ఈ నెల 23వ తేదీ వరకు అప్లికేషన్లు స్వీకరిస్తామని భద్రాద్రి జిల్లా ప్రొహిబీషన్, ఎక్సైజ్ శాఖాధికారి కె.జానయ్య తెలిపారు. ఈ మేరు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చివరి రోజు బీసీ బంద్, బ్యాంకు బందలతో మద్యం షాపులకు దరఖాస్తులు వేసే ఔత్సాహకులు రాలేకపోయారని గుర్తు చేశారు. వారు చేస్తున్న విజ్ఞప్తి మేరకు దరఖాస్తులు స్వీకరించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ ఆదేశాల ప్రకారం ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తులను బాబు క్యాంపులోని జిల్లా అబ్కారీ కార్యాలయంలో స్వీకరిస్తామని తెలిపారు. అలాగే ఈ నెల 23న జిల్లా కలెక్టర్ సమక్షంలో జరగాల్సిన మద్యం షాపుల డ్రా ను ఈ నెల 27వ తేదీకి మార్చినట్లు ప్రకటించారు. డ్రాను కొత్తగూడెం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం పక్కన గల కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహిస్తామని తెలిపారు. గత నెల 26వ తేదీ నుంచి శనివారం వరకు జిల్లా పరిధిలోని 88 మద్యం దుకాణాలకు సంబంధించి 3799 దరఖాస్తులు అందాయని, వీటి నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు ఫీజు రూపంలో రూ.113.97 కోట్లు సమకూరాయని జిల్లా ఎక్సైజ్ శాఖాధికారి కె.జానయ్య తెలిపారు.

రామయ్యకు స్వర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణం

- రామదాసు పీఠం మూలనిధికి హన్మకొండ భక్తుల రూ.లక్ష విరాళం

భద్రాచలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆదివారం అంతరాలయంలో ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆర్జిత సేవలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు. ఇదిలా ఉండగా.. దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి సికింద్రాబాద్‌కు చెందిన కడియాల సత్యనారాయణ కమల దంపతులు లక్ష రూపాయలను విరాళంగా అందించారు. అలాగే శ్రీ భద్రాచల రామదాసు పీఠం మూల నిధికి హన్మకొండకు చెందిన సముద్రాల రాఘవ నరసింహాచార్యులు సుజాతాదేవి దంపతులు రూ.1,01,101 విరాళంగా అందించారు.


ఆంధ్రజ్యోతికి వార్షికోత్సవ మరియు దీపావళి శుభాకాంక్షలు
రేవంతన్నది.. ప్రజా ప్రభుత్వం...
తుమ్మలన్నది.. రైతు రాజ్యం...
అభివృద్ధిలో ఆదర్శం... అందరి సంక్షేమమే లక్ష్యం...
రాష్ట్రంలోనే మోడల్ సిటీ, సూపర్ సిటీ,
లివింగ్ సిటీ... మన ఖమ్మం...
ఖమ్మం ఎమ్మెల్యేగా, రాష్ట్ర వ్యవసాయ
మార్కెటింగ్ సహకార, చేనేత శాఖా
మంత్రిగా రెండేళ్ళలో రెండువేల కోట్ల తో
ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి... మంత్రిగా
రాష్ట్ర రైతన్నలకు, రుణ మాఫీ
రైతు భరోసా, వరి పంటకు బోనస్,
గిట్టుబాటు ధరలతో
రైతన్న కుటుంబాలలో వెలుగులు...
ఇది మన ఖమ్మం గుమ్మంలో అభివృద్ధి పరుగులు....
తుమ్మల అన్నతోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా
అభివృద్ధి, సంక్షేమం సాధ్యం...
ఖమ్మం నియోజకవర్గ మరియు
ఉమ్మడి జిల్లా ప్రజలకు
దీపావళి శుభాకాంక్షలు...
ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

దివ్యకాంతుల దీపావళి నేడు

(5వ పేజీ తరువాయి)

వస్తోంది. దీప జ్యోతిని పరబ్రహ్మ స్వరూపంగా, మనోవికాసానికి, ఆనందానికి, నవ్వులకు, సజ్జనత్వానికి, సద్గుణ సంపత్తికి నిదర్శనంగా భావిస్తారు. మహిళలందరూ ఆశ్వీయుజ బహుళ చతుర్దశి నుంచి కార్తిక మాసమంతా సంధ్యా సమయంలో మట్టి ప్రమిదలలో దీపాలను వెలిగిస్తారు. దీపావళి ఋతువులు మారే సమయంలో వస్తుంది. బంధువులంతా ఒక చోటికి చేరుతారు. కొత్తగా పెళ్లిళ్లు చేసిన కుటుంబాల్లో కూతురిని, అల్లుడిని ఇంటికి ఆహ్వానిస్తారు. రకరకాల పిండి వంటకాలు చేస్తారు. మహిళలు నోములు, వ్రతాలు చేస్తారు. అలా అప్పటి నుంచి ప్రజలు దీపావళి రోజు లక్ష్మీదేవి పూజలు నిర్వహిస్తారు. దీపావళి రోజు మహాలక్ష్మీని పూజించేవారికి సర్వ సంపదలు చేకూరుతాయని విశ్వాసం.

● **పటాకులు కాల్చే సమయంలో జాగ్రత్త**

పటాకులు కాల్చే సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. పెద్దపెద్ద బాంబులు కాల్చేప్పుడు దూరంగా ఉండాలి. వీలైనంత వరకు వాటిని కాల్చకుండా ఉండడమే మేలు. చిన్నపిల్లలను బాంబులు కాల్చే చోటుకు రానివ్వొద్దు. వారికి స్థాయిని బట్టి కాల్చే అవకాశం ఇవ్వాలి. తల్లిదండ్రులు, బంధువులు గమనిస్తుండాలి. పొగ ఎక్కువగా వచ్చే పటాకుల వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నది. దమ్ము, దగ్గు ఉన్న వారిని దూరంగా ఉంచితే మంచిది. ముఖ్యంగా మహిళలు, బాలికలు కాటన్ దుస్తులు ధరిస్తే మంచిది. స్కిల్ చీరెలు, దుస్తుల వల్ల చిన్న నిప్పురవ్వ మీద పడినా ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. జాగ్రత్తలు తీసుకుని దీపావళీని రంగులమయంగా చేసుకోవాలని కోరుకుందాం.

● **ప్రజలకు ప్రముఖుల దీపావళి శుభాకాంక్షలు**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు, రేణుకాచౌదరి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర (గాయత్రి రవి), ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ్‌రెడ్డి, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, జితేష్ వి పాటిల్ ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగ జరుపుకొంటామని పేర్కొన్నారు. ప్రజలందరి జీవితాల్లో ఆనందపు ప్రగతి కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సుఖశాంతులతో, సిరిసంపదలతో తులతూగాలని మనసారా కోరారు. తగిన జాగ్రత్తలు పాటిస్తూ పటాకులు కాల్చాలని, ఇంటిల్లిపాది ఆనందంగా పండుగను జరుపుకోవాలని కోరారు.

పేలుతున్న దీపావళి టపాసుల ధరలు



ఇల్లందులో ఏర్పాటుచేసిన టపాసుల దుకాణాలు

ఇల్లెందు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా బాణసంచా రేట్లు భారీగా పెరిగాయి. పండుగకు వీధుల్లో టపాసులు కాల్చడం సంప్రదాయం కావడంతో ఉమ్మడి జిల్లా వాసులు పెద్దఎత్తున టపాసులను కొంటున్నారు. గత ఏడాదితో పోలిస్తే వివిధ రకాల టపాసుల రేట్లు 20నుంచి 40శాతం వరకు పెరగడం గమనార్హం. గతేడాది 10 చిచ్చుబుడ్ల బాక్స్ ధర సైజును బట్టి రూ.400 వరకు ఉండగా.. ఈ యేడు రూ.600గా నిర్ణయించారు. ఆటం బాంబులు, లక్ష్మీ బాంబుల రేట్లు గతంలో రూ.250 ఉండగా.. ఈసారి 300నుంచి రూ.350 వరకు అమ్మతున్నారు. ఒక వెయ్యి థౌజండ్ వాలా బాక్స్ ధర రూ.200 నుంచి 250కి పెరిగింది. 30షాట్స్ రాకెట్ బాంబుల బాక్స్ రేటు రూ. 250 నుంచి 400కు పెరిగింది. టపాసుల తయారీదారులే ధరలు పెంచడం వల్ల అనివార్యంగా రేట్లు పెంచాల్సి వచ్చిందని పలువురు విక్రయదారులు చెబుతున్నారు. రేటెంత పెరిగినా.. టపాసులు కాల్చడం అనివార్యంగా మారడంతో ఉమ్మడి జిల్లా వాసులు శక్తిమేర కొనుగోళ్లు జరుపుతున్నారు.

ఏసీబీ సోదాల కలకలం

(5వ పేజీ తరువాయి)



వీకే కోల్‌మైన్ వ్యూ పాయింట్‌ను పరిశీలించిన సింగరేణి డైరెక్టర్లు

అర్ధరాత్రి 12:30 గంటల వరకు డ్రైవర్లు, క్లీనర్లు మాత్రమే వస్తూ వెళ్తూ ఉండేవారు. అయితే ఎలాంటి హడావిడి లేకుండా నలుగురు వ్యక్తులు సాదాసీదాగా అక్కడికి వచ్చారు. అక్కడి గార్డ్ అప్రమత్తం అయ్యేలోపే ఏసీబీ అధికారులు ఆర్టీఏ చెక్‌పోస్టులోకి వెళ్లి టేబుల్‌లో ఉన్న క్యాష్ , కంప్యూటర్‌ను వారి ఆధీనంలోకి తీసుకున్నారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలోని బృందం పాల్వంచ ఆర్టీవో చెక్‌పోస్ట్‌పై దాడులు నిర్వహించి.. శనివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆదివారం ఉదయం వరకు ఆకస్మికంగా సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా అనధికారికంగా 25,100 రూపాయల నగదు ఉన్నట్టు అధికారులు నిర్ధారించారు. కంప్యూటర్‌లో నమోదైన వాహనాల వివరాలను పరిశీలించారు. 24 గంటల్లో ఆర్టీఏ చెక్‌పోస్టు నుంచి తిరిగిన వాహనాలు, అదనపు లోడ్ల వివరాలను సమగ్రంగా సేకరించారు. టేబుల్‌లో ఉన్న 25,100 స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సోదా చేసి రికార్డులను పరిశీలించి సంబంధిత నివేదికలను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఆర్టీఏ చెక్‌పోస్ట్‌లో అసిస్టెంట్ ఆర్టీఏకి నోటీసులు జారీ చేశారు.

వీకే కోల్‌మైన్ పనులను వేగవంతం చేయండి

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు

కొత్తగూడెం టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని వెంకటేష్‌ఖని కోల్‌మైన్ పనులను వేగవంతం చేయాలని సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ కొప్పుల వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్ధేశించిన సమయంలోపు మట్టి తొలగింపు పనులను పూర్తి చేయాలన్నారు. ఆదివారం వీకే కోల్‌మైన్‌ను పరిశీలించారు. వ్యూ పాయింట్ నుంచి మట్టితొలగింపు పనులను పరిశలీంచి పనులను మరింత వేగవంతం చేసే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ఓబీ డంప్ పనుల్లో రక్షణ సూత్రాలను పాటించాలని కోల్ డిస్పాచ్ ఏర్పాట్లను చేయాలన్నారు. మట్టి తొలగింపు పనులు సకాలంలో పూర్తి చేసి బొగ్గు ఉత్పత్తి చేసేవిధంగా చర్యలు చేపట్టాలని కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజును కోరారు. కోల్ మైన్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోల్‌మైన్స్ ప్రాజెక్ట్ అధికారి ఎం. శ్రీ రమేష్, మేనేజర్ రామచంద్ర మురళి, సోదా కంపెనీ మేనేజర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఫొటో ఎగ్జిబిషన్

ఆవిష్కరించిన చైర్మన్ వీరబాబు

చుంచుపల్లి, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి):కొత్తగూడెం గ్రంథాలయంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు ఆదివారం ఆవిష్కరించారు. ఈఫొటో ఎగ్జిబిషన్‌లో జిల్లాలో గతంలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగాలు పొందిన ఫొటోలు, న్యూస్‌పేపర్ కటింగ్స్, గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమాల ఫొటోలతో సమాచారాన్ని అందుబాటులో ఉంచారు. ప్రత్యేక చొరవ తీసుకొని ఫొటో ఎగ్జిబిషన్‌ను తయారు చేసిన గ్రంథ పాఠకురాలు మణిమృదులను, సిబ్బందిని అభినందించారు. ప్రతి ఫొటోను పేపర్‌కటింగ్ పరిశీలించి ఇలా ఎన్నో కార్యక్రమాలను గ్రంథాలయాభివృద్ధికి తోడ్పడతాయన్నారు. వీటిని తిలకించి, ప్రేరణ పొంది, ఆదర్శంగా తీసుకొని అనేక మంది పాఠకులు, నిరుద్యోగ అభ్యర్థులు, విద్యార్థులు ఉద్యోగాలు సంపాదిస్తారని చైర్మన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ

▸▸ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే పాయం

మణుగూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జరగబో యే స్థానిక సంస్థల ఎన్నికల్లో మణుగూరు మండలానికి సంబంధించి 14 సర్పంచ్ స్థానాలకు, 11 ఎంపీటీసీలకు, జడ్పీటీసీ స్థానానికి పోటీ చేయనున్నామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మండల నాయకులు కార్యకర్తలకు తెలిపారు. ఆదివారం క్యాంపుకార్యాలయంలో మండల ముఖ్య నాయకులు కార్యకర్తలతో ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం తాజాగా జడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ స్థానాల పట్ల కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఈమేరకు మండలంలోని అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అన్ని సీట్లలో బరిలో దిగబోతున్నారని పేర్కొన్నారు. పార్టీ ఖరారు చేసిన అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేసి గెలిపించుకోవాలని సూచించారు. జరగబోయే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు అంతా ఐక్యంగా ఎలాంటిబేధాభిప్రాయాలు లేకుండా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు నవీన్, శివసైదులు,తరుణ్‌రెడ్డి, సౌజన్య, రహీం,. కృష్ణం రాజు, ఈశ్వర్ రెడ్డి, కూచిపూడి బాబు, సామా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

రూ.25లక్షలతో

అభివృద్ధి పనులు : పాయం

మణుగూరు పట్టణంలోని ప్రదాన రహదారి మధ్య గల డివైడర్ల ప్రాంతంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటే శ్వర్లు ఆదివారం మొక్కలు నాటారు. పట్టన సుందరీకరణ పనుల్లో భాగంగా రూ.25 లక్షల నిధులను కేటాయించి పాత సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ పాడై పోవడంతో కొత్త లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఈ దీపావళికి కొత్త కాంతుల శోభ పట్టణంలో నెలకొందన్నారు. గతంలో డివైడర్ల మధ్య పర్యావరణానికి , ప్రజానికానికి హాని కలిగించే మోనోకార్పస్ మొక్కలు ఉండేవని వాటిని తొలగించి చక్కటి అహ్లాదాన్ని ఇచ్చే పూల మొక్కలను నాటించామన్నారు. పట్టణానికి ఈ మొక్కలు పెరిగి పచ్చదనపు శోభను సంతరింపజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

నేటిగిరిజన దర్బారు రద్దు

భద్రాచలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించే గిరిజన దర్బారు రద్దు చేస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. దీపావళిని పురస్కరించుకొని ఐటీడీఏ అధికారులందరూ అందుబాటులో ఉండని కారణంగా గిరిజన దర్బార్ రద్దు పరుస్తున్నట్లు పేర్కొన్నారు.

కూలిన ఎర్రవాగు వంతెన

ప్రజల రాకపోకలకు తప్పని ఇబ్బందులు

జూలూరుపాడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచినేనిపేట పంచాయతీ పరిధిలోని గోపాతండా - వాగొడ్డుతండా గ్రామాల మధ్య ఉన్న ఎర్రవాగుపై నిర్మించిన లోలెవెల్ వంతెన శనివారం అర్ధరాత్రి కూలింది. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలిగింది. ఈ వంతెనపై అధిక లోడ్‌లతో తరుచూ వాహనాలు తిరుగుతుండటంతో వంతెన దెబ్బతింది. ఈక్రమంలో ఇసుక ట్రాక్టర్ వెళుతుండటంతో వంతెన మధ్యభాగం కూలిపోయింది. ఆదివారం పీఆర్‌డిఈ నాగేందర్, ఏఈలు దెబ్బతిన్న వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రజల రాకపోకలకు అసౌకర్యం కలగకుండా తాత్కలిక మరమ్మతులను చేపడతామని డిఈ తెలిపారు. వంతెన నిర్మాణానికి నిధుల మంజూరికై ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపిస్తామని తెలిపారు.

చెస్ క్రీడాకారిణికి మెచ్చా అభినందన

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చెస్ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైన భవ్యశ్రీని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం ఘనంగా సత్కరించారు. అశ్వారావుపేటకు చెందిన కేసుబోయిన ఆంజనేయులు కూతురు భవ్యశ్రీ లక్ష్మీ రాష్ట్రస్థాయిలో జరిగిన చెస్ పోటీల్లో ప్రధమంగా నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో ఆదివారం ఆంజనేయులు నివాసానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా భవ్యశ్రీని శాలువాతో ఘనంగా సత్కరించారు. జాతీయస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. అంతకు ముందు పట్టణంలో పలువురిని పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ సున్నం నాగమణి నివాసంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మోహనరెడ్డి, వగ్గెల పూజ, గొడవర్తి వెంకటేశ్వరరావు,ఫణీంద్ర, పట్టణ అధ్యక్షులు సంపూర్ణ, మోహన్, తాళం సూరిబాబు, రాంబాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.



మట్టి అక్రమ తవ్వకాలు

జూలూరుపాడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజారావుపేట గ్రామ సమీపంలోని సీతారామ కాలువ వద్ద నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఆదివారం పాపకొల్లు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్సకవేటర్ కాలువ మట్టిని తవ్వి ట్రాక్టర్లలో తరలించి విక్రయిస్తున్నారు. కొన్ని రోజులుగా కాలువ మట్టిని యదుచ్ఛగా తవ్వుతూ కొందరు వ్యక్తులు అక్రమ రవాణా సాగిస్తున్నప్పటికి సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవటంలేదని ప్రజలంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మండలంలోని కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లో, సీతారామ కాలువ వద్ద తవ్వకాలు జరిపి మట్టిదందా సాగిస్తున్నారు. అక్రమార్కులకు స్థానిక ప్రజా ప్రతినిధి అండదండలు ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతుంది.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ పరీక్షలు


మణుగూరుటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామానుజవరం గ్రామం లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత షుగర్, బీపీ పరీక్షలను నిర్వహించారు. గ్రామంలోని 50 మందికి ఈ పరీక్షలను నిర్వహించామిన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మొత్తం శెట్టి నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి కృష్ణ, డాక్టర్ దేవదాస్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా కార్తీక్

భద్రాచలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా కుసిని కార్తీక్‌ని ఎన్నిక చేసినట్లు ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి పౌల్ రాజు పేర్కొన్నారు.

భద్రాచలంలో ఆదివారం జరిగిన ప్రజా సంక్షేమ సంఘం సమావేశంలో ఈ మేరకు ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. అల్లాడిపౌల్ రాజు మాట్లాడుతూ ప్రజల హక్కుల సాధన కోసం పోరాటంలో భాగస్వామ్యం కావలని యువత తెలుసుకుంటే ఏదైనా సాధించగలరని పేర్కొన్నారు. యువతను ప్రజా సంక్షేమం సంక్షేమ ఉద్యమ నాయకులుగా ప్రోత్సహిస్తుందని, అందులో భాగంగానే కార్తీక్ నియామకం మండల నాయకులు, కార్యకర్తల ఉమ్మడి నిర్ణయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి రాజ్, యేసు, దశంబాబు, రామకృష్ణ, మురికి శ్రీను, బాస్కర్, పామేల్‌రాజు పాల్గొన్నారు.





మహిళల అభివృద్ధికోసం కాంగ్రెస్ చేయూత


ఇందిరామహిళాశక్తి మహిళలతో ఎమ్మెల్యే జారె

అశ్వారావుపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధిచెందటానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అందజేస్తుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఆదివారం అశ్వారావుపేటలో స్వయంసహాయ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాకర్స్ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వడ్డీలేని రుణంతో ఈ దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. అలానే మహిళలకు వడ్డీలేని రుణాలు, ఆర్‌టీసీలో ఉచిత ప్రయాణాలు, విద్యుత్ ఉచిత బిల్లులు, పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటు వంటి ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని, మహిళలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మా రాంబాబు, ప్రమోద్, నార్లపాటి రాములు, మిండా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంలో యువకుడిపై కత్తులతో దాడి

● ఐదు చోట్ల వ్యక్తికి కత్తిపోట్లు

భద్రాచలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భద్రాచల పట్టణంలో మరోసారి స్థానిక యువకులు కత్తులతో దాడి చేసుకున్నారు. పట్టణంలోని పాత మార్కెట్ వద్ద ఆదివారం సాయంత్రం పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిపై కత్తులతో దాడి చేశారు. దీంతో అతన్ని భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కత్తులతో దాడి చేసిన క్రమంలో ఆ యువకుడి పరిస్థితి నిలకడగా ఉందని, 24 గంటలు గడిస్తే గాని పూర్తి పరిస్థితి చెప్పలేమని వైద్యులు పేర్కొంటున్నారు. కత్తిపోట్లకు గురైన యువకుడి పేరు ప్రవీణ్‌గా తెలుస్తోంది. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు సమాచారం. ఇటీవల భద్రాచలంలో యువకులు ఇదే రీతిలో కత్తులతో దాడి చేసుకోవడం తరచూ జరుగుతోంది.


చికిత్స పొందుతున్న యువకుడు

చెన్నారావుకు మంత్రి తుమ్మల నివాళి


నివాళులర్పిస్తున్న తుమ్మల

దమ్మపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గండుగులపల్లి గ్రామానికి చెందిన తుమ్మల చెన్నారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి చెన్నారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఆయన వెంట పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాదు, అచ్యుతరావు, పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగప్రసాదు, కేవిసత్యనారాయణ, ఎర్రా వసంతరావు, చల్లగుళ్ళ నర్సింహారావు, చలసాని సాంబశివరావు తదితరులు ఉన్నారు.



ప్రజలను మభ్య పెడుతున్న ప్రభుత్వాలు

మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా

కరకగూడెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట ప్రజలను మాయమాటలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్య పెడుతూ కాలం వెల్లబుచ్చుతున్నాయని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆరోపించారు. ఆదివారం కరకగూడెంలోని ఆయన స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలుచేయలేక బీఆర్ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తు కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. బీసీ 42 శాతం రిజర్వేషన్ పేరుతో ప్రజలను మోసం చేస్తుందని.. నిన్న జరిగిన బీసీ బందులో కాంగ్రెస్, బీజేపీలు పాల్గొనడం ఎవరిని నిందలపాలు చేయడానికని ధ్వజమెత్తారు.గతంలో కరకగూడెం మండలంలో పులుసు బొంత ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.20 కోట్లు తీసుకొస్తే చేతకాని ఎమ్మెల్యే అప్పుడు చేయలేక పోయాడు. మరలా నేను గెలిచిన తరువాత సుమారు 200 వందల కోట్లకు ప్రతిపాదనాలు పంపించి అ టవీ శాఖకు భూములు కూడా ఏర్పాటు చేసి టెండర్ ప్రక్రియ ఫైల్ సీఎం కేసీఆర్ వద్దకు చేరే వరకు ఎన్నికల కోడ్ రావడంతో ఆగిందని గుర్తు చేశారు. ఈ నెల 27న జిల్లా వ్యాప్తంగా రహదారులపై ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ కొమరం రాంబాబు, రాష్ట్ర యువజన నాయకుడు లక్కమధు, సీనియర్ నాయకులు అక్కిరెడ్డి వెంకటరెడ్డి, బైరిశెట్టి చిరంజీవి, రేగా లక్ష్మణరావు, ఊకె రామనాథం, రేగా సత్యనారాయణ, క్రిష్ణరావు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రేగా



ఆంక్షల ఉత్తర్వుల ప్రతుల దహనం

వైరా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌ఫెడ్ పరిశ్రమ, నర్సరీల్లోకి రైతులకు అనుమతి లేకుండా ప్రవేశం లేదంటూ జారీ చేసిన ఉత్తర్వుల ప్రతులను తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైరాలో దహనం చేశారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఆయిల్‌ఫెడ్ సం స్థ జారీ చేసిన అప్రజాస్వామిక ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



